==================================================================
**Language in India** www.languageinindia.com **ISSN 1930-2940 Vol. 19:4 April 2019**
**India's Higher Education Authority UGC Approved List of Journals Serial Number 49042**
================================================================

# An Enquiry on the External (Consonant) Sandhi in Telangana Telugu

**Dr. Pammi Pavan Kumar**
**Associate Professor**
**pavankpammi@gmail.com**

**Ms. K. Lavanya**
**Ph. D. Research Scholar**
**lavanyakumarik1993@gmail.com**

**Department of Telugu**
**University of Hyderabad**
**Hyderabad-500046**
**Telangana, India**
====================================================================

**Abstract**

This paper offers a few observations on the external (consonant) sandhi formation in Telangana Telugu. In the beginning of this paper, Sandhi definitions are discussed in detail, drawn both from Panini and modern Indian (Telugu) grammarians/linguists. The possible sandhi forms in Telugu identified by earlier grammarians were also depicted in the beginning of the paper. Examples given in this paper are primarily drawn from the Telugu natives of Telangana. The issues discussed in this paper may be seen as the continuation work of Prof. Bh. Krishna Murti's research work on external sandhi in Telugu.

**Keywords:** Telangana Telugu, sandhi formation, external consonant sandhi, early grammarians on external sandhi, Bk. Krishnamurti on external sandhi in Telugu

# తెలంగాణ తెలుగులో హల్సంధి

## An enquiry on the External (consonant) *sandhi* in Telangana Telugu

Dr. Pammi Pavan Kumar, Associate Professor,
<pavankpammi@gmail.com>
Ms. K. Lavanya, Ph.D. Research Student,
<lavanyakumarik1993@gmail.com>
Department of Telugu, University of Hyderabad, Hyderabad – 500046, TS. India.

================================================================================

## 0. సంధి: నిర్వచనం

పాణిని *'అష్టాధ్యాయి'* లో 'పరః సన్నికర్షః సంహితా' (*పాణి. అష్టా*: 183-184) అని 'సంహిత' ను నిర్వచించారు. అక్షరాల మధ్య అర్థమాత్రా కాలిక వ్యవధానం కంటే ఎక్కువ వ్యవధానం లేకుండా ఉండే స్థితిని 'సంహిత' అంటారు. పాణిని 'సంహిత' అనే శబ్దాన్ని 'సంధి' అనే అర్థంలో ఉపయోగించారు. కాని, తెలుగు వ్యాకర్తలు ఎవరూ 'సంహిత' అనే శబ్దాన్ని ఉపయోగించలేదు. అందరూ 'సంధి' అనే పదాన్నే ఉపయోగించారు.

తెలుగులో ప్రథమ వ్యాకరణ కర్త అయిన మూలఘటిక కేతన తన *ఆంధ్రభాషా భూషణం*లో 'సంధి'ని కింది విధంగా నిర్వచించారు.

కం. "మొదలి పదము తుది వర్ణము
వదలక పై పదము మొదలి వర్ణము తోడన్
గదియగ సంధులు నాఁదగు..." అని 'సంధి' నిర్వచనం చెప్పారు. (*ఆం.భా.భూ:* 43)

విన్నకోట పెద్దన తన *"కావ్యాలంకార చూడామణి"* గ్రంథంలో 'సంధి' ని ఈ కింది విధంగా నిర్వచించారు.

తే. గీ. "ఆదిశబ్దాంత వర్ణంబు నంత్యశబ్ద
పూర్వవర్ణంబుతోఁగూడఁ బొత్తుచేఁత
సంధియగుఁగారక క్రియా సంగతములు
పెక్కు రూపంబులవి గానిపింతుఁదెలియ" అని నిర్వచించారు. (*కావ్యా. చూ.* 9: 45)

మూలఘటిక కేతన, విన్నకోట పెద్దన పూర్వ పదంలోని అంత్య వర్ణానికీ, పర పదంలోని ఆది వర్ణానికీ మధ్య జరిగే కార్యాన్ని 'సంధి' అని తెలిపారు. వీటిలో అచ్చులు మాత్రం అని గాని, పరరూపత్వం అని గాని చేర్చలేదు. వీరు ప్రధానంగా వర్ణ సంయోగమే సంధి అని నిర్వచించారు. చిన్నయసూరి వీరికి కొంచెం భిన్నంగా "పూర్వపరస్వంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి యనంబడు" (*బాల – సంధి*–1: 14) అని నిర్వచించారు. చిన్నయసూరి వర్ణసంయోగానికి బదులు స్వర సంయోగమే సంధి అని నిర్వచించి, పరరూపత్వాన్ని చేర్చి సంధి లక్షణాన్ని ఇంకా తగ్గించారు. ఈ నిర్వచనం వలన తెలుగులో సంధి అనగా అచ్సంధి మాత్రమే అని, అందులో పరరూపసంధి మాత్రమే అని స్పష్టమవుతోంది. బాలవ్యాకర్త చెప్పిన 'సంధి' నిర్వచనం కన్నా మూలఘటిక కేతన, విన్నకోట పెద్దన ఇచ్చిన సంధి నిర్వచనాలు అధిక వ్యాప్తిని కలిగి ఉన్నాయి. కాబట్టి 'సంధి' నిర్వచనాన్ని పునఃసమీక్షించి భాషావేత్తలు ఈ కింది నిర్వచనాలను ఇచ్చారు.

"కొన్ని అర్థకాలు కలిసి పదంగా ఏర్పడేటప్పుడూ, కొన్ని పదాలు కలిసి వాక్యంగా ఏర్పడేటప్పుడూ వాటిలో ధ్వనులు పరస్పర ప్రభావం వల్లనో లేక చారిత్రక కారణాల వల్లనో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటువంటి ధ్వనుల మార్పును 'సంధి' అంటారు." (సుబ్రహ్మణ్యం, పి. యస్.: *ఆ. భా. సి.*: 76–77)

భద్రిరాజు కృష్ణమూర్తిగారు "అవ్యవహితోచ్చారణలో దగ్గరగా ఉన్న రెండు మూడు వర్ణాల్లో వచ్చే లోపాదేశాది కార్యాలను 'సంధి' అనవచ్చు" అని సంధిని నిర్వచించారు. (*భా. స. సం.*: 40)

'సంధి' రెండు రకాలుగా జరుగుతుంది.

i. అంతస్సంధి లేదా పదమధ్యసంధి (Internal Sandhi)

ii. బాహ్యసంధి లేదా పదాంత సంధి (External Sandhi)

i. ఒకే పదంలో ధ్వనుల మధ్య కలయిక జరిగితే దానిని 'అంతస్సంధి లేదా పదమధ్యసంధి' (Internal Sandhi) అంటారు.

ii. రెండు వేర్వేరు పదాల మధ్య కలయిక జరిగితే దానిని 'బాహ్యసంధి లేదా పదాంత సంధి' (External Sandhi) అంటారు.


బాహ్యసంధి విధాన పరంగా మరల రెండు రకాలు.

a. అచ్సంధి

b. హల్సంధి

**a. అచ్సంధి:** అజంత రూపాలపై జరిగే సంధి అచ్సంధి. ఇది అచ్చుకు–అచ్చుకు, అచ్చుకు–హల్లుకు మధ్య జరుగుతుంది.

**b. హల్సంధి:** హలంత రూపాలపై జరిగే సంధి హల్సంధి. ఇది హల్లుకు–హల్లుకు, హల్లుకు– అచ్చుకు మధ్య జరుగుతుంది.




భద్రిరాజు కృష్ణమూర్తిగారు 'భాష–సమాజం–సంస్కృతి' అనే గ్రంథంలో "నేటి తెలుగులో హల్సంధి" అనే వ్యాసాన్ని రాశారు. దానికోసం వారు కోస్తా జిల్లాలో ఉన్న శిష్టుల వ్యవహారాన్ని ఆధారంగా తీసుకున్నారు.

ఈ వ్యాసాన్ని ఆధారంగా చేసుకొని తెలంగాణ ప్రాంతంలో ఉన్న హల్సంధి రూపాలను రేఖామాత్రంగా పరిచయం చేయడం ఈ వ్యాసోద్దేశ్యం. ఇందులో భద్రిరాజు కృష్ణమూర్తిగారు సూచించిన మార్పులతో పాటు, మరికొన్ని మార్పులను ప్రస్తావించడం జరిగింది.

## 1. మొదటిరకం మార్పు

పూర్వ పర హల్లులలో మార్పు రాకుండా, మధ్యలో ఉన్న అచ్చు లోపించడం వల్ల ఈ హల్లులు రెండూ కలిసి సంయుక్తాక్షరంగా మారతాయి. *(భా. స. సం*: 40)

**ఉదా:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| a) | ట+అ+ర | = | ట్ర | = | ఎంకట్రాముడు (ఎంకట+రాముడు) |
| b) | ర+అ+చ | = | ర్చ | = | అర్చేతు (అర+చేతు) |
| | ర+అ+క | = | ర్క | = | ఎదుర్కోలు (ఎదురు+కోలు) |
| | ర+అ+ద | = | ర్ద | = | ఎదువర్దాక (ఎదువర+దాక) |
| | ర+అ+స | = | ర్స | = | జెర్సేపు (జర+సేపు) |
| c) | జ+అ+క | = | జ్క | = | రాజ్కుంటుంది (రాజు+కుంటుంది) |
| d) | ల+అ+జ | = | ల్జ | = | కమాల్జేస్తున్నవా (కమాలు+చేస్తున్నవా) |
| | ల+అ+వ | = | ల్వ | = | కాల్వెట్టు (కాలు+పెట్టు) |
| | ల+అ+జ | = | ల్జ | = | కాల్జాడించు (కాలు+జాడించు) |
| | ల+అ+జ | = | ల్జ | = | కాల్జేతులు (కాలు+చేతులు) |
| | ల+అ+గ | = | ల్గ | = | కాల్గుంజుతుంది (కాలు+గుంజుతుంది) |
| | ల+అ+ద | = | ల్ద | = | కుత్కెల్దాక (కుతికెల+దాక) |
| | ల+అ+గ | = | ల్గ | = | చెవుల్గిల్లుమన్నుంటున్నయి–చెవులు+గిల్లుమంటున్నాయి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | ల+అ+డ | = | ల్డ | = | పుల్లల్డబ్బి (పుల్లల+డబ్బి) |
| e) | ట+అ+జ | = | ట్జ | = | ఒకట్జేసుడు (ఒకటి+చేసుడు) |
| | ట+అ+వ | = | ట్వ | = | తూట్వోకుండ (తూటు+పోకుండ) |
| f) | క+అ+వ | = | క్వ | = | ఒడ్డుక్వడ్డదు (ఒడ్డుకు+పడ్డదు) |
| g) | డ+అ+జ | = | డ్జ | = | కట్టడ్జేసింద్రు (కట్టడి+చేసింద్రి) |
| | డ+అ+గ | = | డ్గ | = | కుంకుడ్గాయలు (కుంకుడు+కాయలు) |
| | డ+అ+క | = | డ్క | = | జాడ్కట్ట (జాడు+కట్ట) |
| h) | న+అ+జ | = | న్జ | = | గౌరమ్మన్జేసింద్రు (గౌరమ్మను+చేసింద్రు) |
| | న+అ+జ | = | న్జ | = | పన్జేతున్నడు (పని+చేస్తున్నడు) |
| | న+అ+గ | = | న్గ | = | దేవున్గుడి (దేవుని+గుడి) |
| i) | మ+అ+గ | = | మ్ప | = | పామ్పడిగె (పాము+పడిగె) |

## 2. రెండోరకం మార్పు

హ్రస్వాచ్చు లోపించి దానికి పూర్వాన ఉన్న హల్లు, పరహల్లుగా మారి, ద్విత్వం అవుతుంది. *(భా. స. సం*: 41)

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | గ+అ+క | = | క్క | = | ముఖం కడుక్కుంటుండు (కడుగు+కుంటుండు) |
| | గ+అ+క | = | గ్గ | = | ఎగ్గొట్టిండి (ఎగ+కొట్టిండు) |
| | గ+అ+క | = | క్క | = | ములక్కాయ (ములగ+కాయ) |

పూర్వపర హల్లులు ఒకే విధంగా ఉన్నప్పుడు పూర్వ హల్లు, పరహల్లు యథాతథంగానే ఉంటాయన్నా లేకపోతే పూర్వహల్లు, పరహల్లుగా మారుతుందన్నా చిక్కులేదు. *(భా. స. సం*: 42)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **ఉదా:** | ర+అ+ర | = | ర్ర | = | గత్తర్రాను (గత్తర+రాను) |
| | ద+అ+ద | = | ద్ద | = | యాడాద్దినం– యాడాది+దినం (సంవత్సరీకం) |
| | క+అ+క | = | క్క | = | చెరుక్కట్టె (చెరుకు+కట్టె) |
| | క+అ+క | = | క్క | = | రోజుక్కొంతమంది (రోజుకు+కొంతమంది) |
| | ల+అ+ల | = | ల్ల | = | బస్సుల్లేవు (బస్సులు+లేవు) |
| | గ+అ+గ | = | గ్గ | = | నాలుగ్గంటలకు (నాలుగు+గంటలకు) |
| | ప+అ+ప | = | ప్ప | = | కర్నప్పంతులు (కర్నపు+పంతులు) |

పై ఉదాహరణల్లో అచ్చుకు ఇరువైపులా ఒకే రకమైన హల్లు ఉండి, సంధి జరిగి అచ్చు లోపించి, పూర్వహల్లు పరహల్లుగా మారింది.

## 3. మూడోరకం మార్పు

ఇక్కడ సంధివల్ల ఏర్పడ్డ ద్విత్వం, హ్రస్వాచ్చుకు ముందూవెనకా గల రెండు హల్లుల కన్నా భిన్నమైనది. *(భా. స. సం*: 43)

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | డ+అ+న | = | ణ్ణ | = | దేవుణ్ణి (దేవుడు+ని) |
| | డ+అ+ల | = | ళ్ళ | = | బళ్ళు (బడి+లు) |
| | డ+అ+ల | = | ళ్ళ | = | కోళ్ళు (కోడి+లు) |

పై ఉదాహరణల్లో సంధి జరిగిన తర్వాత అచ్చు లోపించి, దానికి ఇరువైపులా ఉన్న హల్లుల కంటే భిన్నమైన హల్లు వచ్చింది.

## 4. నాల్గవ రకం మార్పు

ఇక్కడ అచ్చు లోపించకుండా పరహల్లు మాత్రమే లోపించి, పూర్వహల్లులో మార్పులేకుండా అలానే ఉంటుంది.

| | | | | |
|---|---|---|---|---|
| **ఉదా:** | క+అ+వ | = క+అ | = | ఈడ్సుకచ్చిందు (ఈడ్సుక+వచ్చిందు) |

'ఈడ్సుక వచ్చిందు' లో 'వ' అనే హల్లు లోపించి 'ఈడ్సుకచ్చిందు' అని అయ్యింది. పూర్వహల్లులో ఎలాంటి మార్పు లేదు. అచ్చు అలానే ఉంది. దీనికి కారణం తెలంగాణలో 'వ' ను 'అ' గా ఉచ్చరించడమే. కింది వాటిలో కూడా ఇదే మార్పు చూడవచ్చు.

| | | | | |
|---|---|---|---|---|
| క+అ+వ | = | క+అ | = | గుంజుకచ్చిందు (గుంజుక+వచ్చిందు) |
| డ+అ+వ | = | డ+అ | = | దేవుడచ్చిందు (దేవుడు+వచ్చిందు) |
| క+అ+వ | = | క+అ | = | చేతికచ్చింది (చేతికి+వచ్చింది) |
| ర+అ+వ | = | ర+అ | = | చెక్కెరచ్చింది (చెక్కర+వచ్చింది) |

## 5. అయిదవ రకం మార్పు

ఇందులో అచ్చు లోపించి పరహల్లు, పూర్వహల్లుకు ఒత్వంగా మారుతుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | క+అ+వ | = | కొ | = | కోపం పొడ్సుకొస్తుంది (పొడుచుక+వస్తుంది) |
| | ర+అ+వ | = | రొ | = | ఎదురొచ్చిన్రు (ఎదురు+వచ్చిన్రు) |
| | డ+అ+వ | = | డో | = | ఎడ్డోడు (ఎడ్డి+వాడు) |

పై ఉదాహరణల్లో అచ్చు లోపించి, పరహల్లు అయిన 'వ' పూర్వహల్లుకు ఒత్వంగా మారింది.

## 6. ఆరో రకం మార్పు

ఇందులో పూర్వహల్లు, అచ్చు పూర్తిగా లోపించి, పరహల్లుకు ద్విత్వం వస్తుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | డ+అ+న | = | న్న | = | గాన్నుంచి (అక్కడినుంచి) |
| | డ+అ+న | = | న్న | = | ఏన్నుంచి (ఎక్కడినుంచి) |
| | డ+అ+న | = | న్న | = | గీన్నుంచి (ఇక్కడినుంచి) |

పై ఉదాహరణల్లో అచ్చుతోపాటు పూర్వ హల్లు (డ) కూడా లోపించి, పరహల్లు ద్విత్వం (న్న) గా మారింది.

### 7. ఏడవ రకం మార్పు

ఇందులో ఒకే రకమైన పూర్వ పర హల్లులు ఉన్నా, అచ్చు లోపించినప్పుడు ఆ రెండు హల్లుల స్థానంలో మరో హల్లు ద్విత్వంగా వస్తుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | క+అ+క | = | గ్గ | = | నాగ్గూడ (నాకు+కూడ) |
| | ల+అ+ల | = | ళ్ళ | = | తేళ్ళు (తేలు+లు) |

### 8. ఎనిమిదవ రకం మార్పు

ఈ మార్పు పదం మధ్యలో అచ్చు లోపించడంవల్ల జరుగుతుంది. ఇందులో పదంలో ఉన్న అచ్చు లోపించి, పరహల్లు పూర్వహల్లుతో కలిసి సంయుక్తాక్షరంగా మారుతుంది. ఇలాంటి మార్పు తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తోంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | ల+అ+వ | = | ల్వ | = | తెల్వదు (తెలవదు) |
| | ర+అ+గ | = | ర్గ | = | తిర్గడం (తిరగడం) |
| | డ+అ+మ | = | డ్మ | = | నడ్మ (నడమ) |
| | న+అ+ష | = | న్ష | = | మన్షి (మనిషి) |
| | న+అ+క | = | న్క | = | ఎన్క (వెనక) |
| | క+అ+వ | = | క్వ | = | ఎక్వ (ఎక్కువ) |

### 9. తొమ్మిదవ రకం మార్పు

ఇందులో అచ్చుతో పాటు పరహల్లు కూడా లోపించి, పూర్వహల్లుకు ఒత్వం చేరుతుంది. దానితోపాటు పూర్వ హల్లు ముందు హల్లుకు అదనంగా మరో హల్లు చేరుతుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | ద+అ+వ | = | దో | = | ప్యాదోళ్ళు (పేద+వాళ్ళు) |
| | క+అ+వ | = | కొ | = | య్యాలకొచ్చినవు (వేళకు+వచ్చావు) |

## 10. పదవ రకం మార్పు

ద్విరుక్త హల్లుకు, మరో హల్లు పరమైనప్పుడు, అచ్చు లోపించి, అది అద్విరుక్తమవుతుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | **చ+అ+త** | = | **స్త** | = | **తెస్తుంది (తెచ్చు+తూ)** |
| | **ప+అ+త** | = | **ప్త** | = | **చెప్తుంది (చెప్పు+తూ)** |

## 11. పదకొండవ రకం మార్పు

ఇక్కడ అచ్చు లోపించి, పరహల్లులో మార్పు రాకుండా, పూర్వహల్లులో మాత్రమే మార్పు జరిగి ద్విత్వమవుతుంది. ఇందుకు కారణం తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో ఏకవచనం వాడాల్సిన చోట బహువచనాన్ని వాడతారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | **ర+అ+ద** | = | **ళ్ళ** | = | **ఎవళ్ళదగ్గర (ఎవరి+దగ్గర)** |
| | **ర+అ+న** | = | **ళ్ళ** | = | **ఎవళ్ళ నుంచి (ఎవరి+నుంచి)** |

## 12. ముగింపు

ఈ విధంగా తెలంగాణ ప్రాంతంలో 'హల్సంధి' రూపాలలో వైవిధ్యం కనిపిస్తోంది. తెలంగాణ ప్రాంత తెలుగు వ్యవహర్తల మౌఖిక వ్యవహారంలో ఈ వైవిధ్యం చాలా స్పష్టంగా గుర్తించవచ్చు. మరింత మౌఖిక సమాచారాన్ని సేకరించి ఈ అధ్యయనాన్ని మరింతగా కొనసాగించేందుకు అవకాశం ఉంది.

## 13. సంప్రదించిన గ్రంథాలు


1. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. (మొదటి ముద్రణ: 2000). ***భాష, సమాజం, సంస్కృతి.*** హైదరాబాదు: నీల్‌కమల్ పబ్లికేషన్స్.
2. కేతన, మూలఘటిక. 1949. ***ఆంధ్రభాషా భూషణము.*** మద్రాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
3. చంద్రయ్య, శివన్న. 2017. ***తిమ్మాజీపేట మండల మౌఖిక భాష – వర్ణనాత్మక వ్యాకరణం.*** పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు విశ్వవిద్యాలయం.
4. చిన్నయసూరి, పరవస్తు. 2014. (మొదటి ముద్రణ: 1970). ***బాలవ్యాకరణము.*** హైదరాబాదు: విశాలాంధ్ర

పబ్లిషింగ్ హౌస్.

5. నారాయణరావు, చిలుకూరి. 1987. ***ఆంధ్ర భాషా చరిత్రము.*** మద్రాసు: ఆనంద ముద్రణాలయం.

6. పవన్‌కుమార్, పమ్మి. 2003. ***కట్టా వరదరాజు ద్విపద రామాయణం – భాషాపరిశీలన.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

7. పెద్దన, విన్నకోట. 1972. ***కావ్యాలంకార చూడామణి.*** మద్రాసు: వేదము వేంకట రాయశాస్త్రి అండ్ బ్రదర్స్.

8. భాస్కర్, నలిమెల. 2017. (మొదటి ముద్రణ: 2003). ***తెలంగాణ పదకోశం.*** హైదరాబాదు: అలుగు ప్రచురణలు.

9. మల్లేష్, మంత్రి. 2012. ***వేముల ఎల్లయ్య కక్క నవల: భాషా వైవిధ్యం.*** ఎం. ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

10. రవిచంద్ర, మల్లిపూడి. 2017. ***కూచిమంచి తిమ్మకవి రచనలు: భాష, సాహిత్యానుశీలన.*** పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు విశ్వవిద్యాలయం.

11. శ్రీహరి, రవ్వా. 2015. ***పాణినీయ అష్టాధ్యాయి (తెలుగు అనువాదం).*** హైదరాబాదు: తెలుగు అకాడమి.

12. సుబ్రహ్మణ్యం. పి. యస్. 2015. ***ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

*****